# క్రైం కౌంటర్

webisite:www.crimecounter.in ప్రజా సంక్షేమమే అంతిమ లక్ష్యం తెలుగు దిన పత్రిక

సంపుటి : 02 సంచిక : 133 క్రిష్ణా, శనివారం 07 - 02 - 2026 పేజిలు : 4 వెల. 2 /-



రిపోర్టర్లు కావలెను

క్రైం కౌంటర్

తెలుగు దిన పత్రికలో పనిచేయుటకు ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రంలో

- జిల్లా బ్యూరోలు
- జిల్లా ఇన్‌చార్జీలు
- నియోజక వర్గ ఇన్‌చార్జీలు

కావలెను.

సంప్రదించవలసిన మా ఫోన్ నంబరు

98497 07349


## గుండ్రేవుల నిర్మిస్తా వేదవతి, ఆర్డీఎస్ పూర్తి చేస్తా

**కర్నూలు-బళ్లారి నేషనల్ హైవే రోడ్డు నిర్మాణానికి చర్యలు**

**గురు రాఘవేంద్ర ప్రాజెక్టుకు రూ.45 కోట్లు మంజూరు**

**పులికనుమ సామర్థ్యం పెంచేందుకు చర్యలు**

**కలుగొట్ల సభలో సీఎం చంద్రబాబు**

**మీ భూమి- మీ హక్కు సభ సూపర్ సక్సెస్**



క్రైం కౌంటర్ న్యూస్, కర్నూలు/ఎమ్మిగనూరు, ఫిబ్రవరి6 గుండ్రేవుల జలాశయం మూడు రాష్ట్రాల మధ్య సమస్య అని, తెలంగాణ, కర్ణాటక భూములు కూడా ముంపుకు గురవుతాయి కాబట్టి ఆ రాష్ట్రాలతో సంప్రదించి ప్రాజెక్టు నిర్మాణానికి చర్యలు తీసుకుంటానని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టమైన హామీ ఇచ్చారు. ఎమ్మిగనూరు మండలం కలుగొట్ల గ్రామంలో సర్పంచ్ చిట్టెమ్మ అధ్యక్షతన 'మీ భూమి- మీ హక్కు' గ్రామ సభ నిర్వహించారు. కలుగొట్లలో 1884 మంది రైతులకు పట్టాదారు పాసు పుస్తకాలు సీఎం చంద్రబాబు పంపిణీ చేశారు. నియోజకవర్గం నుంచి పెద్ద ఎత్తున రైతులు, కార్యకర్తలు తరలి వచ్చారు. కలుగొట్ల పొలాలు రైతులతో నిండిపోయాయి. చంద్రబాబును చూసేందుకు పెద్ద సంఖ్యలో రైతులు తరలివచ్చారు. అంతకుముందు వివిధ శాఖలు ఏర్పాటు చేసిన స్టాళ్లను సీఎం చంద్రబాబు పరిశీలించారు. వేదికపై రైతులతో మాట్లాడారు. పట్టాదారు పాసు పుస్తకంలో అన్ని వివరాలు సక్రమంగా ఉన్నాయా..? అంటూ కలుగొట్లకు చెందిన రైతులు బుడగ జంగాల నడిపన్న, రంగన్న గౌడ్‌లను అడిగి తెలుసుకున్నారు. సీఎం చంద్రబాబుతో పాటు వేదికపై రైతులు నీరుగంటి రాముడు, ఈడిగ సుజాతలకు స్థానం కల్పించారు. చంద్రబాబు మాట్లాడుతున్నంత సేపు రైతులు ఉత్సాహంతో కేరింతలు కొట్టారు. చంద్రబాబు హయాంలోనే తమకు మద్దతు ధర, రైతులకు భరోసా లభిస్తుందని నినదించారు.

ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు మాట్లాడుతూ జిల్లాలో సాగునీటి ప్రాజెక్టులకు ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తానన్నారు. గతంలో గుండ్రేవుల ప్రాజెక్టుకు తానే నిధులు ఇచ్చానని, తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాలతో చర్చించి ప్రాజెక్టు నిర్మాణానికి కృషి చేస్తానన్నారు. తుంగభద్ర జలాలు కర్నూలు జిల్లా ఎక్కువగా వినియోగించుకుని పశ్చిమ ప్రాంతం సస్యశ్యామలం అయ్యేలా చేస్తామన్నారు. వేదవతి ప్రాజెక్టు నిర్మాణం పూర్తి చేస్తే ఆలూరు, ఆదోని నియోజకవర్గాల్లో 80వేల ఎకరాలకు సాగునీరు అందుతుందన్నారు. ఈ ప్రాజెక్టును పూర్తి చేసే బాధ్యత కూటమి తీసుకుంటుందని వివరించారు. అదే క్రమంలో ఆర్డీఎస్ కుడికాలువ ప్రాజెక్టును కూడా పూర్తి చేసి సాగునీరు ఇస్తామని చంద్రబాబు వివరించారు. గత ప్రభుత్వంలో గురురాఘవేంద్ర ప్రాజెక్టుకు నిధులు ఇవ్వకుండా నిర్వీర్యం చేశారని, ఈ ప్రాజెక్టు మరమ్మతుల కోసం రూ.44 కోట్లు ఇప్పుడే మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. రాయలసీమకు గత టీడీపీ ప్రభుత్వంలో 120 ప్రాజెక్టులు మంజూరు చేస్తే ఆ తర్వాత వచ్చిన వైసీపీ పాలకులు ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదని చంద్రబాబు వివరించారు. ఎంపీ బస్తిపాటి నాగరాజు విన్నపం మేరకు కర్నూలు- బళ్లారి జాతీయ రహదారి నిర్మాణం చేపడతామని స్పష్టమైన హామీ ఇచ్చారు. అలాగే ఎమ్మిగనూరు- బళ్లారి మీదుగా డోర్నగల్ రైల్వేలైన్ నిర్మాణానికి చర్యలు తీసుకుంటామని చంద్రబాబు తెలిపారు.

**టెక్స్‌టైల్ పార్కు ద్వారా చేనేతలకు ఉపాధి**

ఎమ్మిగనూరులో టెక్స్‌టైల్ పార్కు ఏర్పాటు చేస్తున్నాం. కేంద్ర ప్రభుత్వం కూడా మెగా టెక్స్‌టైల్ పార్కులో భాగంగా సాకారం అందిస్తుంది. దీని ద్వారా 2వేల మంది చేనేతలకు ఉపాధి లభిస్తుందని చంద్రబాబు వివరించారు. ఎమ్మిగనూరు మంత్రాలయం నియోజకవర్గంలో సాగునీరు అందించేందుకు పులికనుమ ప్రాజెక్టును 3.5 టీఎంసీల సామర్థ్యానికి పెంచుతాం.. గాజులదిన్నె ప్రాజెక్టు పనులు పూర్తి చేసేందుకు అవసరమైన నిధులు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. ఎమ్మిగనూరు బైపాసు రోడ్డుకు రూ.130 కోట్లు ఇచ్చేందుకు కేంద్రం ఆమోదం తెలిపిందని చంద్రబాబు వివరించారు. జలజీవన్ మిషన్ ద్వారా ప్రతి ఇంటికి కుళాయి అందించే బాధ్యత తీసుకుంటామన్నారు. కలుగొట్ల గ్రామంతో పాటు ఎమ్మిగనూరు నియోజకవర్గంలో శ్మశానాలకు ప్రత్యేక ప్రాధాన్యత ఇచ్చి అవసరమైన భూమిని కేటాయించాలని కలెక్టర్‌ను చంద్రబాబు ఆదేశించారు. కర్నూలు ఉల్లి రైతులను ఆదుకోవాలనే లక్ష్యంగా హెక్టారుకు రూ.50వేలు బోనస్ ఇచ్చిన ఘనత కూటమి ప్రభుత్వానిదే అని తెలిపారు.

**మా కుటుంబంతో బీవీకి విడదీయని అనుబంధం**

ఎమ్మిగనూరు అంటేనే గుర్తుకు వచ్చేది బీవీ మోహన్‌రెడ్డి అనో, ఆయనకు తమ కుటుం బంతో, ఎన్టీఆర్ కుటుంబంతో విడదీయరాని అనుబంధం ఉందని చంద్రబాబు అన్నారు. తమ ఇంట్లోకి నేరుగా వచ్చే స్వేచ్ఛ ఒక్క బీవీకే ఉందని గుర్తు చేశారు. ఆయన బతికి ఉన్నప్పుడు పట్టుబట్టి గురురాఘవేంద్ర ప్రాజెక్టును సాధించుకున్నారని తెలిపారు. బీవీ మోహన్‌రెడ్డి కుటుంబం టీడీపీకి నిబద్ధతగా ఉంటుందని తనకు తెలుసని, ఆయన తనయుడు బీవీ జయనాగేశ్వరరెడ్డి కూడా నియోజకవర్గ అభివృద్ధి కోసం నిధులు ఇవ్వాలంటూ తన వెంట పడుతున్నారని, ఇది మంచి పద్ధతి అని చంద్రబాబు పేర్కొన్నారు.కార్యకర్తలే పార్టీకి జీవనాడులు

**ప్రజలకు నిత్యం అందుబాటులో ఉండాలి**

**టీడీపీ కార్యకర్తల సమావేశంలో సీఎం చంద్రబాబు**

ఎన్నికలకు సూపర్ సిక్స్, బాబు షూరిటీ – భవిష్యత్తుకు గ్యారెంటీతో ముందుకు వెళ్లాం.. కార్యకర్తలు కూడా బలంగా ప్రజల్లోకి తీసుకెళ్లడంతో 2024 ఎన్నికల్లో ఊహించని విజయం అందుకున్నామని టీడీపీ అధినేత, సీఎం చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. కలుగొట్ల దగ్గర పార్టీ కార్యకర్తల సమావేశంలో చంద్రబాబు మాట్లాడారు. తెలుగు తమ్ముళ్లను ఉత్తేజపరుస్తూ ప్రసంగం సాగింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పింఛన్లు రూ.4వేలు, రూ.6వేలు, రూ.10వేలు, రూ.15వేలు ఇస్తున్నాం. నెలనెల రూ.3వేల కోట్లచొప్పున ఏడాదికి దాదాపు రూ.35కోట్లు ఇస్తున్నాం. పింఛన్ పంచేటప్పుడు ప్రతి కార్యకర్త వెళ్లాలి.. ప్రజలకు కార్యకర్తలే కనిపించాలి. అప్పుడే మనకు ఓట్లుగా మారుతారని దిశానిర్దేశం చేశారు. ప్రజల్లో 90శాతం సంతృప్తి తీసుకురావాలన్నారు. ప్రజల వద్దకు వెళ్లే బాధ్యత మీరు తీసుకోవాలన్నారు. ఎన్నికలు ఏవైనా ఏకపక్షంగా విజయం సాధించే లక్ష్యంగా ముందుకెళ్లాలన్నారు. ఇండియా టుడే సర్వేలో ఎంతో పాజిటివ్ ఉందన్నారు. అదే ఉత్సాహంతో కార్యకర్తలు పనిచేయాలన్నారు. ఈ మూడేళ్లలో 175 నియోజకవర్గాల్లో కార్యకర్తలను కలుస్తానన్నారు. ఎమ్మిగనూరు నియోజకవర్గంలో గతంలో పోలిస్తే సంతృప్తి పెరిగిందని, అది మహిళల్లో ఎక్కువగా ఉందని సూచించారు. పురుషుల్లో కూడా పార్టీపై అభిమానం పెరిగేలా చూడాలన్నారు. ప్రధాని మోదీని చూసి కేంద్రంలో, ఇక్కడ రాష్ట్రంలో నన్ను, పవన్ కల్యాణ్‌ను చూసి టీడీపీ, జనసేన కార్యకర్తలు ఓట్లు వేస్తారని గుర్తు చేశారు. రాష్ట్రంలో 86శాతం సంతృప్తి ఉంటే, ఎమ్మిగనూరు ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డిపై 91శాతం పాజిటివ్ ఉందని వివరించారు. ప్రజలకు న్యాయం జరగాలంటే ఎమ్మెల్యే ఇక్కడే ఉం డాలని హితోపదేశం చే శారు. కార్యక్రమంలో మంత్రులు నిమ్మల రామానాయుడు, టీజీ భరత్, అనగాని సత్యప్రసాద్, ఎంపీ బస్తిపాటి నాగరాజు, ఎమ్మెల్యేలు బీవీ జయనాగేశ్వరరెడ్డి, కేఈ శ్యాంబాబు, టీడీపీ జిల్లా అధ్యక్షురాలు గుడిసె కృష్ణమ్మ, ప్రధాన కార్యదర్శి నాగరాజు యాదవ్, ఉపాధ్యక్షులు భాస్కర్ల చంద్రశేఖర్, ఆదోని, మంత్రాలయం, ఆలూరు టీడీపీ ఇన్‌చార్జిలు మాజీ ఎమ్మెల్యే కె.మీనాక్షినాయుడు, ఎన్.రాఘవేంద్రారెడ్డి, వైకుంఠంజ్యోతి, కుడా చైర్మన్ సోమిశెట్టి వెంక టేశ్వర్లు, డీసీఎంఎస్ చైర్మన్ నాగేశ్వరరావు యాదవ్, మారె ?కట్ యార్డు చైర్మన్ మల్లయ్య, కురువ కార్పొరేషన్ డైరెక్టర్ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## ఆ ముగ్గురి ప్రతిఘటనే నాకు స్ఫూర్తి



క్రైం కౌంటర్ న్యూస్ ఫిబ్రవరి 06 : గుండె ధైర్యానికితోడు సమయస్ఫూర్తి ఉంటే ఎంతటి క్లిష్టపరిస్థితితినైనా ఎదుర్కోవచ్చు.. అందుకు నాడు అసెంబ్లీ సమావేశాల్లో మంత్రులు గొట్టిపాటి, స్వామి, ఎమ్మెల్యే ఏలూరి చూపిన తెగువే నిదర్శనం.. అదేనాకు స్ఫూర్తినింపింది.. మీకూ స్ఫూర్తి కావాలి' అంటూ టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, మంత్రి లో కేష్ భావోద్వేగ ప్రసంగం చేశారు. టీడీపీ కేంద్ర కార్యాలయంలో శు క్రవారం జరిగిన టీడీపీ బూత్ కమిటీల మేనేజ్‌మెంట్ వర్క్‌షాపులో ఆయన పాల్గొన్నారు. ఈ వర్క్‌షాపునకు ఉమ్మడి ప్రకాశం జిల్లా నుంచి పర్చూరు, కనిగిరితోపాటు మరికొన్ని నియోజకవర్గాల నుంచి పార్టీ లోక్‌సభ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు, ఆ నియోజకవర్గాల్లోని మండల పార్టీ అధ్యక్షులు బూత్ కమిటీ నిర్వహణపై నియమించిన పర్యవేక్షకులు హాజరయ్యారు. రాష్ట్రంలోని పలు నియోజకవర్గాల నుంచి వందలాది మంది పాల్గొన్న వర్క్‌షాపులో మంత్రి లోకేష్ మాట్లాడుతూ కొన్ని సంఘటనలను ఉదహరిస్తూ వారిలో స్ఫూర్తి కలిగించే ప్రయత్నం చేశారు. ఆ సందర్భంగా ఏలూరితోపాటు ప్రస్తుత రాష్ట్ర మంత్రులు గొట్టిపాటి, స్వామిలను కొనియాడుతూ మాట్లాడారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ఆ పార్టీ ఎమ్మెల్యేలు అసెంబ్లీలో మూకుమ్మడిగా మన నాయకుడిపై దాడికి దిగే ప్రయత్నం చేశారు. అదే సమయంలో ఏలూరి సమయస్ఫూర్తితో వ్యవహరిస్తూ.. మమ్మల్ని దాటి ముందుకు కదలండి అంటూ ముందుకొచ్చారు. మరోవైపు స్వామి, గొట్టిపాటి కూడా రంగంలోకి వచ్చారు. వారి సమయస్ఫూర్తి, తెగింపుతో అసెంబ్లీలో ఉన్న మిగిలిన మన సభ్యులు కూడా అప్రమత్తమయ్యారు. లేకుంటే ఆ రోజు మననాయకుడు(చంద్రబాబు)పై వైసీపీ ఎమ్మెల్యేలు దాడి చేసి ఉండేవారు. నాయకుడిని, కార్యకర్తను కాపాడుకునేందుకు అలాంటి తెగింపు, సమయస్ఫూర్తిఉ ండాలని అప్పుడే గుర్తించారు. ఆ సంఘటనే నాకు స్ఫూర్తి అయింది. మీరు కూడా స్ఫూర్తిగా తీసుకుని మీ పరిధిలో కార్యకర్తలకు ఇబ్బందులు ఎదురైనప్పుడు ఐక్యంగా ముందుకునడవాలని హితవుపలికారు. అంతేగాక ఆయా నియోజకవర్గాల నుంచి వచ్చి వర్క్‌షాపులో పాల్గొన్న వారికి 'మీలో మీ ఎమ్మెల్యే ఎంతమందికి తెలుసు, ఎవరెవరు నేరుగా మాట్లాడుతన్నార'ని ఆరాతీశారు. ఆ సందర్భంగా ఏలూరిని పిలిచి ఈయన మీకు తెలుసా, మీలో ఎంతమంది ఆయనతో మాట్లాడారంటూ పర్చూరు నియోజకవర్గంలో బూత్ స్థాయి నుంచి వర్క్‌షాపునకు వెళ్లిన వారిని ప్రశ్నించారు. వారంతా మాకు తెలుసు మాట్లాడతాం అంటూ చెప్పారు. మిగిలిన నియోజకవర్గాల వారు కూడా మీమీ ఎమ్మెల్యేతో నేరుగా మాట్లాడండి, కార్యకర్తలకు అండగా ఉ ండండి అని చెప్పారు.

## తీరం భద్రతకే 'సైక్లోథాన్'



క్రైం కౌంటర్ న్యూస్, భోగాపురం, ఫిబ్రవరి 6: తీర ప్రాంత భద్రత, దేశ భక్తి, పర్యావరణ పరిరక్షణ పట్లపై ప్రజల్లో అవగాహన కల్పించడమే ధ్యేయంగా సీఐఎస్ఎఫ్ (సెంట్రల్ ఇండస్ట్రీయల్ సెక్యూరిటీ ఫోర్స్) ఆధ్వర్యంలో వందేమాతరం కోస్టల్ సైక్లోథాన్ ర్యాలీ నిర్వహిస్తున్నట్లు ఎస్పీ ఎ.ఆర్.దామోదర్ తెలిపారు. శ్రీకాకుళం వైపు నుంచి విశాఖ వైపు వెళ్తున్న సైక్లోథాన్ సైకిల్ ర్యాలీ శుక్రవారం జిల్లాలోకి ప్రవేశించింది. ఈ ర్యాలీకి స్థానిక జాతీయ రహదారిపై ఎస్పీ ఆధ్వర్యంలో పోలీసులు ఘన స్వాగతం పలికారు. వందేమాతరం, భారత మాతకు జై, జై భారత్ అనే నినాదాలతో ఆ ప్రాంతం హోరెత్తి పోయింది. ఈసందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. సీఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో రెండు బృందాలు తొమ్మిది రాష్ట్రాల గుండా సుమారు 6,553 కిలో మీటర్ల మేర తూర్పు, పశ్చిమ తీర ప్రాంతాల్లో ఉన్న 52 తీర గ్రామాల్లో సైకిల్ ర్యాలీ ద్వారా పర్యటించనున్నట్లు తెలిపారు. పశ్చిమ బెంగాల్ బఖాళి నుంచి తూర్పు తీరానికి ఒక బృందం, పశ్చిమ తీరంలో ఒక బృందం ఈ ర్యాలీని ప్రారంభించాయన్నారు. ఈ ర్యాలీ గతనెల 28న ప్రారంభమైందన్నారు. 25 రోజుల పాటు సాగి ఈ నెల 22న కేరళలోని కొచ్చిన్ తీరంలో ముగుస్తుందన్నారు. ఈ బృందంలో సీఐఎస్ఎఫ్‌కి చెందిన 136 మంది సభ్యులు ఉన్నారని అన్నారు. తీరం వెంట అపరిచిత వ్యక్తులు, పడవలు, అనుమానితులు ఎవరైనా కనిపిస్తే ప్రజలు వెంటనే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. నిర్లక్ష్యం వహిస్తే దేశ భద్రతకే ముప్పు ఏర్పడే ప్రమాదముందని అన్నారు. కార్యక్రమంలో సీఐ కె.దుర్గాప్రసాదరావు, ఎస్బీ సీఐ ఏవీ లీలారావు, సీఐఎస్ఎఫ్ అసిస్టెంట్ కమాండెంట్ ఏకే మహాపాత్ర, ఎస్ఐలు పాపారావు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## నరవణె పుస్తకంపై కేంద్రం క్లారిటీ.. "నిషేధం లేదు.. కేవలం నిబంధనల ప్రకారమే పరిశీలన"



క్రైం కౌంటర్ న్యూస్ ఫిబ్రవరి 06 : ఆర్మీ మాజీ చీఫ్ జనరల్ మనోజ్ ముకుంద్ నరవణె రాసిన పుస్తకం విషయంలో కేంద్ర ప్రభుత్వానికి ఎటువంటి విభేదాలు లేవని కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్ స్పష్టం చేశారు. ఆయన గౌరవప్రదమైన పదవిలో పనిచేశారని, ప్రభుత్వం ఆయన్ను ఎంతో గౌరవిస్తుందని ఆమె పేర్కొన్నారు. అయితే, ఆయన రాసిన పుస్తకంపై నిషేధం విధించామన్న వార్తలను ఆమె తోసిపుచ్చారు. రక్షణ శాఖ నుంచి రావాల్సిన సాంకేతికపరమైన అనుమతులు (క్లియరెన్స్) ఇంకా ప్రక్రియలోనే ఉన్నాయని, అంతకు మించి మరేమీ లేదని ఆమె వివరించారు.భారత సాయుధ దళాల పనితీరుపై ప్రధాని నరేంద్ర మోదీకి ఉన్న నమ్మకాన్ని ఈ సందర్భంగా మంత్రి గుర్తుచేశారు. సరిహద్దుల్లో ఎదురయ్యే సవాళ్లను ఎదుర్కోవడానికి, దేశ ప్రయోజనాల దృష్ట్యా ఏది సరైనది అనిపిస్తే అది చేసే పూర్తి స్వేచ్ఛను ప్రధాని సైన్యానికి ఇచ్చారని ఆమె తెలిపారు. గత ప్రభుత్వాల హయాంలో ఉన్నట్లుగా సాయుధ దళాలు నిర్ణయాల కోసం వేచి చూడాల్సిన అవసరం లేదని, మోదీ నాయకత్వంలో సైన్యం మరింత బలోపేతమైందని ఆమె అన్నారు.ఇదే క్రమంలో కాంగ్రెస్ హయాంలోని విదేశీ విధానాలను, గత ప్రధాని నెహ్రూ వైఖరిని నిర్మలా సీతారామన్ విమర్శించారు. చైనా దురాక్రమణ సమయంలో అరుణాచల్ ప్రదేశ్ ప్రజలను ఉద్దేశించి "మిమ్మల్ని మీరు చూసుకోండి" అని నెహ్రూ అన్నట్లుగా, ఇప్పుడు మోదీ ప్రభుత్వం బాధ్యతలను విస్మరించదని ఆమె చురకలు అంటించారు. ప్రస్తుత ప్రభుత్వం సరిహద్దు ప్రాంతాల భద్రతను, అక్కడి ప్రజల ప్రయోజనాలను అత్యంత ప్రాధాన్యతగా భావిస్తుందని స్పష్టం చేశారు. మొత్తానికి, నరవణె పుస్తక వివాదానికి తెరదించుతూనే, దేశ రక్షణ విషయంలో రాజీ పడే ప్రసక్తే లేదని కేంద్ర మంత్రి పునరుద్ఘాటించారు. మాజీ ఆర్మీ చీఫ్ అనుభవాలు దేశానికి ఆస్తి అని, అయితే భద్రతా పరమైన నిబంధనల మేరకు రక్షణ శాఖ అనుమతులు తప్పనిసరని ఆమె వెల్లడించారు. ఈ విషయంలో రాజకీయ విమర్శలకు తావులేదని, సైన్యం మరియు ప్రభుత్వానికి మధ్య ఉన్న సమన్వయం దృఢంగా ఉందని ఆమె తన ప్రసంగంలో పేర్కొన్నారు.

# పన్ను పంచాయితీ

**నగర శివారు ప్రాంతాల్లో భారీగా వాణిజ్య సముదాయాలు**
**పంచాయతీలకు ఆస్తి పన్ను చెల్లించేందుకు ససేమిరా**
**అధికారులు నోటీస్ ఇస్తే రాజకీయ నేతలతో ఫోన్లు**
**79 పంచాయతీల్లో సుమారు 53 వేల అసెస్‌మెంట్లు**
**ఈ ఆర్థిక సంవత్సరంలో లక్ష్యం రూ.10.68 కోట్లు**
**ఇప్పటివరకూ వసూలైంది 50 శాతమే**



క్రైం కౌంటర్ న్యూస్ ఫిబ్రవరి 06 : విశాఖపట్నం పెందుర్తి మండలంలో గల ఒక ఎమ్యూజ్‌మెంట్ పార్కు పంచాయతీకి ఏడాదికి రూ.80 వేలు పన్ను చెల్లిస్తున్నది. నిబంధనల మేరకు పన్ను విధించాలన్న అధికారుల ఆదేశాలతో రూ.3.8 లక్షల పన్ను చెల్లించాలని నోటీస్ ఇచ్చారు. దీంతో కీలక ప్రజా ప్రతినిధి ఒకరు ఫోన్ చేసి, పెంచిన పన్ను తగ్గించాలని ఒత్తిడి తెస్తున్నారు.

ఆనందపురం సమీపాన గల ఫంక్షన్ హాలు యాజమాన్యం మూడు నంవత్సరాల నుంచి పన్ను చెల్లించడం లేదని గుర్తించిన అధికారులు ఏడాదికి రూ.ఎనిమిది లక్షల వంతున కట్టాలంటూ నోటీస్ ఇచ్చారు. దీనిపై వైసీపీ కీలక నేత ఒకరు అధికారులకు ఫోన్ చేసి ఒత్తిడి తెస్తున్నారు. నిబంధనల మేరకు పన్ను చెల్లించాల్సిందేనని అధికారులు స్పష్టంచేశారు. ఇదే ప్రాంతంలో ప్రైవేటు కళాశాల నడుస్తున్న భవనానికి రూ.మూడు లక్షలు పన్ను విధిస్తే...చెల్లించేందుకు యజమాని ససేమిరా అంటున్నారు.

ఆనందపురం మండలంలోని ఒక గ్రామంలో జాతీయ రహదారికి ఆనుకుని భారీ భవంతి ఉంది. దానికి పన్నును అధికారులు రూ.90 వేలకు పెంచారు. అందుకు గ్రామ సర్పంచ్ మోకాలడ్డుతున్నారు.

జిల్లాలోని నాలుగు గ్రామీణ మండలాల పరిధిలో 79 పంచాయతీలు ఉన్నాయి. పెందుర్తి, ఆనందపురం, భీమిలి మండలాలు నగరానికి సమీపాన ఉండడంతో పెద్దఎత్తున వాణిజ్య, విద్యా సంస్థలు, హోటళ్లు, ఫ్యాక్టరీలు వంటివి ఏర్పాటయ్యాయి. నాలుగు మండలాల్లో ఆస్తి పన్నుకు సంబంధించి సుమారు 53 వేల అసెస్‌మెంట్లు ఉన్నాయి. వాటి ద్వారా ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రూ.10.68 కోట్లు ఆదాయం లక్ష్యంగా నిర్ణయించగా, ఇప్పటివరకూ 50 శాతం వసూలు చేశారు. ఇళ్ల యజమానులు, చిన్నపాటి దుకాణాల నిర్వాహకులు సకాలంలో పన్నులు చెల్లిస్తున్నారు. ఎక్కువ మొత్తం కట్టాల్సిన వాణిజ్య సముదాయాలు, పెద్ద దుకాణాలు, విద్యా సంస్థలు నడుస్తున్న భవనాల యజమానులు మాత్రం ఏవో కుంటిసాకులు చెబుతున్నారు. రాజకీయ నాయకులతో పంచాయతీ అధికారులపై ఒత్తిడి తెస్తున్నారు. అధికార పార్టీ నేతల ద్వారా కొందరు, వైసీపీ నేతలతో మరికొందరు ఫోన్‌లు చేయిస్తున్నారు. అద్దెల రూపంలో ఏటా విద్యా సంస్థల నుంచి కోట్లాది రూపాయలు వసూలు చేస్తున్న భవనాల యజమానులు కూడా పంచాయతీలకు పన్ను మాత్రం సక్రమంగా చెల్లించడం లేదు.

ఆనందపురం సమీపాన గల ఒక ఫంక్షన్ హాలు యాజమాన్యం చెల్లించే పన్నును సమీక్షించి సవరించారు. దీని ప్రకారం రూ.మూడు లక్షల వరకు పన్ను చెల్లింపునకు నిర్వాహకులు ముందుకువచ్చారు. మరో సంస్థ అడ్డదారులు వెతుకుతుండంతో చర్యలు తీసుకునేందుకు అధికారులు సిద్ధం కాగా, విపక్ష పార్టీకి చెందిన నాయకుడితో ఫోన్ చేయించారు. కాగా మూడేళ్ల నుంచి పన్ను చెల్లించని నేరెళ్లవలస జూట్ మిల్లుపై కోర్టులో కేసు వేశారు. పన్నుల వసూళ్లకు పలుచోట్ల సర్పంచులు అడ్డుపడుతుండడం గమనార్హం. వచ్చే నెలతో సర్పంచుల పదవీకాలం ముగియనున్నందున ఆ తరువాతైన జిల్లా కలెక్టర్ దృష్టిసారిస్తే...నాలుగు మండలాల నుంచి రూ.20 కోట్ల నుంచి రూ.25 కోట్ల ఆదాయం వస్తుందని గ్రామ పంచాయతీ కార్యదర్శి ఒకరు తెలిపారు.

# ఐటీ కంపెనీల ఆపసోపాలు ఆపరేషన్ల ప్రారంభంలో తీవ్ర జాప్యం

**వాయిదాలపై వాయిదాలు వేస్తున్న టీసీఎస్**
**అధికారులకు సమాచారం నిల్**
**ఇంకా పూర్తిస్థాయిలో కార్యకలాపాలు ప్రారంభించని కాగ్నిజెంట్**



క్రైం కౌంటర్ న్యూస్ ఫిబ్రవరి 06 : విశాఖపట్నంవిశాఖపట్నంలో ఎకరా 99 పైసల చొప్పున భూమి తీసుకొని, అక్కడ భవనాల నిర్మాణం చేపట్టక ముందే ఆపరేషన్లు ప్రారంభిస్తామని చెప్పిన అతి పెద్ద ఐటీ కంపెనీలు రెండూ వాయిదాలపై వాయిదాలు వేసుకుంటూ పోతున్నాయి. కారణాలు ఏమిటో వెల్లడించడం లేదు. టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (టీసీఎస్)కు భూములతో పాటు రుషికొండ ఐటీ పార్కులోని మిలీనియం టవర్‌లో అందమైన భవనాన్ని కూడా రాష్ట్ర ప్రభుత్వం సమకూర్చింది. అది ఆర్థిక మండలి పరిధిలో ఉందని, డీనోటిఫై చేయాలని కోరితే...ఢిల్లీ పెద్దలతో మాట్లాడి ఆ పని కూడా పూర్తిచేసింది. అదే కొండపై 21.6 ఎకరాల భూమిని ఎకరా కేవలం 99 పైసలకే ఇచ్చింది. ఆ భూమిలో ఇప్పటివరకూ శంకుస్థాపన జరగలేదు. మిలీనియం టవర్లలో ఇంటీరియర్ మొత్తం పూర్తయిపోయి రెండు నెలలైంది. బోర్డులు కూడా పెట్టేశారు. సంక్రాంతి వెళ్లగానే ఆపరేషన్లు ప్రారంభిస్తామని ఏపీఐఐసీ అధికారులకు సమాచారం ఇచ్చారు. జనవరి 29వ తేదీని ముహూర్తంగా పెట్టుకున్నామని ప్రభుత్వానికి తెలియజేశారు. ఏమైందో ఏమో ఆ తేదీకి ప్రారంభం కాలేదు. మరో తేదీని కూడా వెల్లడించలేదు. వాస్తవానికి ఏడాది నుంచి టీసీఎస్ ప్రారంభమవుతుందని ఐటీ వర్గాలు, జిల్లా అధికార యంత్రాంగం చెప్పుకుంటూ వస్తున్నాయి. ఏ కారణాల చేతనో ప్రారంభం కావడం లేదు. ఈ నెలలో అయినా ఉంటుందా? అంటే అదీ అనుమానమేనని అధికారులు అంటున్నారు. ఫిబ్రవరిలో 15వ తేదీ నుంచి 25వ తేదీ వరకు తూర్పు నౌకాదళం భారీ కార్యక్రమాలు చేపడుతోంది. జాతీయ స్థాయి నాయకులు వస్తున్నారు. ఆ సమయంలో ప్రారంభించే అవకాశం లేదు. అంటే మళ్లీ మార్చి నెలలోనే అనే మాటలు వినిపిస్తున్నాయి.

బోర్డు కూడా పెట్టని కాగ్నిజెంట్

కాగ్నిజెంట్‌కు కాపులుప్పాడలో 22.1 ఎకరాల భూమిని ఎకరా 99 పైసలు చొప్పున ఇచ్చారు. ఆ భూమిలో డిసెంబరు 12వ తేదీన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఏడాదిలో నిర్మాణం పూర్తి చేస్తామని ప్రకటించారు. ప్రతి వారం సమీక్ష చేస్తామని ఐటీ మంత్రి లోకేశ్ ప్రకటించారు. ఈ శంకుస్థాపనకు ముందు ఐటీ పార్కులోని హిల్ నంబరు 2లో మహతి భవనంలో కాగ్నిజెంట్ తాత్కాలిక కార్యాలయం ప్రారంభించారు. 500 మందితో పనిచేస్తుందని ప్రకటించారు. అయితే ఇప్పటివరకూ ఆ భవనానికి కాగ్నిజెంట్ బోర్డు కూడా పెట్టలేదు. ఆపరేషన్లు కూడా పూర్తిస్థాయిలో మొదలు కాలేదు. విశాఖపట్నం రావడానికి 4,500 మంది ఆసక్తి చూపించారని అప్పట్లో ఆ సంస్థ పెద్దలు ప్రకటించారు. కానీ ఎందుకనో ఇంకా పూర్తిస్థాయి ఆపరేషన్లకు శ్రీకారం చుట్టలేదు.

# ఇళ్ల లబ్ధిదారులకే నిధులు ఏప్రిల్ ఒకటి నుంచి బ్యాంకు ఖాతాలకు జమ

**సెంటు భూమిలో ఇళ్ల నిర్మాణం చేపట్టిన కాంట్రాక్టర్లలో అయోమయం**
**పనులకు వెనకడుగు**
**ఏం చేయాలో పాలుపోక హౌసింగ్ అధికారుల మల్లగుల్లాలు**



క్రైం కౌంటర్ న్యూస్, విశాఖపట్నం, ఫిబ్రవరి 6 ప్రధానమంత్రి ఆవాస్ యోజన పథకం కింద అందించే నిధులు పలు రాష్ట్రాలు దారిమళ్లిస్తున్నాయనే ఫిర్యాదులు అందడంతో ఇకనుంచీ నేరుగా లబ్ధిదారుల బ్యాంకు ఖాతాకే జమ చేసేలా కేంద్రం చర్యలు తీసుకుంది. దీంతో ప్రస్తుతం నగర శివారు ప్రాంతాల్లో ఇళ్ల నిర్మాణాలు చేపడుతున్న కాంట్రాక్టర్లలో అయోమయం నెలకొంది. ఇప్పటికే బిల్లుల కోసం ఎదురుచూడాల్సిన పరిస్థితిలో నేరుగా లబ్ధిదారుల ఖాతాకే అందితే, పనులు చేసినా ఇక్కట్లు తప్పవని భావిస్తున్నారు.

నగర శివారు ప్రాంతాల్లో ప్రభుత్వం 65 లేఅవుట్‌లు సిద్ధం చేసి లబ్ధిదారులకు సెంటు చొప్పున స్థలాలు కేటాయించింది. ప్రధానమంత్రి ఆవాస్ యోజన పథకంలో ఇళ్ల నిర్మాణాలను నిధులు అందుతాయి. దీనికి రాష్ట్ర ప్రభుత్వం మరికొంత ఆర్థిక సాయం అందిస్తుంది. అయితే ఇళ్ల నిర్మాణాలపై తాజాగా కేంద్రం ఆంక్షలు విధించింది. ఏప్రిల్ ఒకటో తేదీ నుంచినిధులు నేరుగా లబ్ధిదారుల ఖాతాకే జమ చేయాలని నిర్ణయించింది. దీంతో నగర శివారులో ఇళ్లు నిర్మిస్తున్న కాంట్రాక్టర్లు పనులు చేసేందుకు వెనుకంజ వేస్తున్నారు.

సాగుతున్న నిర్మాణాలు

నగర శివారులో వేసిన 65 లేఅవుట్‌లలో 1,40,798 మంది లబ్ధిదారులకు సెంటు చొప్పున స్థలాలు, 1,14,821 ఇళ్లు కేటాయించారు. తొలిదశలో 80,833 ఇళ్లు మంజూరుచేశారు. నగరానికి దూరం కావడంతో లబ్ధిదారులు సొంతంగా ఇళ్ల నిర్మాణాలకు ముందుకు రాలేదు. దీంతో గత వైసీపీ ప్రభుత్వం కాంట్రాక్టర్ల వ్యవస్థను తీసుకువచ్చింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించే నిధులు కాంట్రాక్టర్లకు చెల్లించేందుకు వీలుగా లబ్ధిదారుడు, కాంట్రాక్టరు, సంబంధిత బ్యాంకు మధ్య త్రైపాక్షిక ఒప్పందం జరిగింది. కేంద్రం నేరుగా నిధులను రాష్ట్ర ప్రభుత్వ ఖాతాకు విడుదల చేస్తుంది. ఆ తరువాత లబ్ధిదారుని ఖాతాకు జమ చేసిన వెంటనే త్రైపాక్షిక ఒప్పందం మేరకు సంబంధిత కాంట్రాక్టర్ ఖాతాకు బదలాయిస్తున్నారు. ఇక ఇనుము, సిమెంట్, ఇసుక ప్రభుత్వమే సరఫరా చేస్తోంది. అయినా మూడేళ్ల క్రితం ప్రారంభించిన ఇళ్ల నిర్మాణాలు సగమే పూర్తయ్యాయి.

అరకొరగానే పనులు

తాజా సమాచారం మేరకు ఇప్పటివరకు 35,202 ఇళ్ల నిర్మాణాలు పూర్తిచేశారు. మిగిలిన 45,631 వివిధ దశల్లో ఉన్నాయి. వీటిలో పునాదుల దశ వరకు సుమారు 25 వేలు ఉండగా, బేస్‌మెంట్ స్థాయిలో 12 వేలు, మిగిలినవి గోడలు, స్లాబ్ వరకు వచ్చాయి. గత ఏడాది సెప్టెంబరు నుంచి బిల్లులు పెండింగ్‌లో పడిపోవడంతో కాంట్రాక్టర్లు నాలుగైదు నెలలుగా పనులు చేయడం లేదు. గత నెలలో కొంతమేర బిల్లులు మంజూరుచేసినా నిర్మాణ పనుల్లోని కార్మికులకు అందకపోవడంతో వారంతా ఇప్పటికీ విధుల్లోకి రాలేదు. ఈ నేపథ్యంలో త్వరలోనే పనులు ప్రారంభిస్తామని ఇటీవల కాంట్రాక్టర్లు అధికారులకు హామీ ఇచ్చారు.

కాంట్రాక్టర్లలో అయోమయం

ప్రధానమంత్రి ఆవాస్ యోజన పథకంలో భాగంగా 2021లో మంజూరుచేసిన ఇళ్ల నిర్మాణాలు ఇప్పటికీ పూర్తికాకపోవడంతో కేంద్రం పలుమార్లు అసంతృప్తి వ్యక్తంచేసింది. ఎప్పటికప్పుడు గడువు పొడిగిస్తూ వచ్చింది. చివరకు మొత్తం ఇళ్ల నిర్మాణాలు పూర్తిచేయడానికిగాను ఈ ఏడాది సెప్టెంబరు నెలాఖరు వరకు గడువు ఇచ్చింది. నిర్మాణాలు పూర్తిచేసే సమయంలో దశలవారీగా బిల్లులు లబ్ధిదారుల ఖాతాకు జమ చేస్తామని స్పష్టంచేసింది. ఈ నేపథ్యంలో సెంటు భూమిలో ఇళ్ల నిర్మాణాలు పూర్తిచేయడానికి కాంట్రాక్టర్లు వెనకడుగు వేస్తున్నారు. గతంలో చేసిన పనులకు బిల్లుల కోసం నెలలు నిరీక్షించామని, ఇప్పుడు లబ్ధిదారుల ఖాతాకు సొమ్ము జమ చేస్తే, అవి తమకు అందడంలో సాంకేతిక ఇబ్బందులు ఎదురవుతాయంటున్నారు. ఈ నేపథ్యంలో పనులకు దూరంగాఉంటే మంచిదని పలువురు భావిస్తున్నారు. దీంతో లబ్ధిదారులు సొంతంగా ఇళ్ల నిర్మాణాలకు ముందుకు వస్తారా? ఒకవేళ రాకపోతే సెప్టెంబరు తరువాత నిధులు నిలిచిపోయే ప్రమాదముందని అంచనా వేస్తున్నారు. దీనిపై రాష్ట్ర ప్రభుత్వం కేంద్రంతో మాట్లాడాలని లబ్ధిదారులు కోరుతున్నారు.

# అసెంబ్లీకి రాకుంటే జీతం ఎందుకు? నో వర్క్, నో పే సిద్ధాంతం తీసుకురావాలి



క్రైం కౌంటర్ న్యూస్,మద్దిలపాలెం, ఫిబ్రవరి 6 'ఉద్యోగి విధులకు రాకపోతే సస్పెండ్ చేస్తున్నాం. జీతం ఆపుతున్నాం. అలాంటప్పుడు ఎమ్మెల్యే అసెంబ్లీకి రాకపోతే జీతం ఎందుకివ్వాలి. ఎందుకు సస్పెండ్ చేయకూడదు. దీనిపై ఆలోచన చేయాలి. నో వర్క్, నో పే సిద్ధాంతాన్ని తీసుకురావాలి. అప్పుడే ఈ తరం కాకపోయినా, తర్వాత తరాలకు ఒక గుణపాఠంగా ఉంటుంది'...అని అసెంబ్లీ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు పేర్కొన్నారు. నగరంలోని పిఠాపురం కాలనీలో గల కళాభారతి ఆడిటోరియంలో శుక్రవారం నిర్వహించిన ఒక కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మహానేతలు ఎన్టీఆర్, ఇందిరాగాంధీ వంటి వారే ఓటమి పాలయ్యారని, అధికారం ఎవరికీ శాశ్వతం కాదని, అలాంటి వారిని చూసి నేర్చుకోవాలన్నారు. గెలుపు, ఓటములు ప్రజా నిర్ణయమన్నారు. గెలిచాక రాష్ట్ర అభివృద్ధి కోసం పనిచేయాలి తప్ప...గొడవలు సృష్టించడానికి కాదన్నారు. ప్రజా సమస్యలు మాట్లాడాలంటే అసెంబ్లీకి రావాలని, బయట ప్రెస్‌మీట్‌లు పెట్టడం కాదన్నారు. అసెంబ్లీకి వచ్చి మాట్లాడితే ముఖ్యమంత్రి, ఉపముఖ్యమంత్రి, మంత్రులు సమాధానం చెబుతారని, వారు చెప్పకపోతే తాను చెప్పిస్తానని చెప్పారు. బయట తిరుగుతూ డైవర్షన్ పాలిటిక్స్ చేయకుండా, అసెంబ్లీకి రండి ఎంత సమయం కావాలో అంత సమయం ఇస్తాను, అక్కడ మాట్లాడండని...అంటూ పరోక్షంగా జగన్‌కు సూచించారు.

ఉక్కు సీఎండీ ఎంపికకు నోటిఫికేషన్
ఈసారైనా కొత్త అధికారికి బాధ్యతలు అప్పగిస్తారా?
గతంలో పబ్లిక్ సెక్టార్ ఎంటర్‌ప్రైజెస్ విభాగం
సెలక్ట్ చేసిన శక్తిమణిని పక్కనపెట్టి వేరొకరికి అదనపు బాధ్యతలు

ఆయన పదవీకాలం ముగియడంతో ఇన్‌చార్జిగా సెయిల్ డైరెక్టర్ మనీశ్‌రాజ్ గుప్తా విశాఖపట్నం స్టీల్ ప్లాంటుకు కొత్త చైర్మన్ కమ్ మేనేజింగ్ డైరెక్టర్ (సీఎండీ)ను నియమించడానికి సెంట్రల్ పబ్లిక్ సెక్టార్ ఎంటర్‌ప్రైజెస్ విభాగం నోటిఫికేషన్ జారీచేసింది. ఈ బాధ్యతను సెర్చ్ కమ్ సెలక్షన్ కమిటీకి అప్పగించింది. ఈసారైనా పూర్తిస్థాయి సీఎండీకి బాధ్యతలు అప్పగిస్తారా?, లేదా?...అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. స్టీల్ ప్లాంటుకు ప్రస్తుతం సెయిల్ డైరెక్టర్ మనీశ్‌రాజ్ గుప్తా ఇన్‌చార్జి సీఎండీగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఆయన జనవరిలో బాధ్యతలు చేపట్టారు. అప్పటివరకు మాంగనీస్ ఓర్ ఇండియా లిమిటెడ్ (ఎంఓఐఎల్) చైర్మన్ ఏకే సక్సేనా ఇన్‌చార్జి చైర్మన్‌గా 15 నెలలు పనిచేశారు. వాస్తవానికి అతుల్‌భట్ సీఎండీగా ఉండగా 2024లోనే కొత్త సీఎండీ కోసం ప్రకటన ఇచ్చారు. 'ది ఫెర్టిలైజర్స్ అండ్ కెమికల్స్ ట్రావెన్‌కోర్'లో ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా పనిచేస్తున్న శక్తిమణిని ఎంపిక చేశారు. అతుల్‌భట్‌కు ఇంకా రెండు నెలల పదవీ కాలం ఉండగానే పనితీరు బాగా లేదని 2024 సెప్టెంబరులో పంపించేశారు. ఆ స్థానంలో శక్తిమణిని నియమించాల్సి ఉంది. కానీ ఇక్కడే ప్రాజెక్ట్స్ డైరెక్టర్‌గా పనిచేస్తున్న ఏకే బాగ్చీకి సీఎండీగా అదనపు బాధ్యతలు ఇచ్చారు. ఆయన సీఎండీ సీట్లో కూర్చొని 20 రోజులు కాక ముందే...ఎంఓఐఎల్ నుంచి ఏకే సక్సేనాను తీసుకువచ్చారు. ఇది పూర్తిగా నిబంధనలకు విరుద్ధం. సెలక్షన్ కమిటీ ఎంపిక చేసిన సీఎండీ ఉండగా ఇలా ఎప్పుడూ వేరొకరిని నియమించలేదు. అడ్డగోలుగా వచ్చిన ఏకే సక్సేనా తన పదవీకాలం పూర్తయ్యే వరకు 2025 డిసెంబరు వరకూ ఇక్కడే కొనసాగారు. ఎంపికైన శక్తిమణిని పూర్తిగా పక్కన పెట్టేశారు. సక్సేనా వెళ్లిపోయాక సెయిల్ డైరెక్టర్ మనీశ్ రాజ్ గుప్తాకు బాధ్యతలు అప్పగించారు. ఈలోగా శక్తిమణి నియామకపు గడువు ముగిసిపోవడంతో ఇప్పుడు కొత్తగా నోటిఫికేషన్ ఇచ్చారు. ఆసక్తి కలిగినవారు మార్చి 5వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఇప్పుడైనా నిబంధనల ప్రకారం ఎంపిక చేసిన అధికారిని నియమిస్తారా?, లేదంటే ఇన్‌చార్జితోనే నెట్టుకొస్తారా?....అని ఉద్యోగ వర్గాలు అనుమానాలు వ్యక్తంచేస్తున్నాయి.

# గోదావరి పుష్కరాలకు సిద్ధం! మంత్రి కందుల దుర్గేష్

**కలెక్టర్, ఎమ్మెల్యేలు, అధికారులతో సమీక్ష**

**పలు సూచనలు చేసిన ప్రజాప్రతినిధులు**



క్రైం కౌంటర్ న్యూస్, రాజమహేంద్రవరం, ఫిబ్రవరి 6 2027 జూన్ 26 నుంచి జులై 7వరకూ జరిగే గోదావరి పుష్కరాలకు అందరూ సిద్ధం కా వాలి, ఇప్పటికే ముఖ్యమంత్రి చంద్రబాబు ఆధ్వ ర్యంలో ఉన్నత స్థాయి మీటింగ్ జరిగింది. దానికి కొనసాగింపుగా సమీక్ష చేశాం. నియోజ కవర్గాల వారీగా ప్రజాప్రతినిధుల నుంచి ప్రతిపా దనలు స్వీకరించి సమగ్ర కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేయాలని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సిని మాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్ అధి కారులను ఆదేశించారు. తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం కలెక్టరేట్‌లో శుక్రవారం జి ల్లా కలెక్టర్ కీర్తి చేకూరి, ఎమ్మెల్యేలు గోరంట్ల బుచ్చయ్యచౌదరి, బత్తుల బలరామకృష్ణ, నల్లమల్లి రామకృష్ణారెడ్డి, వేగుళ్ల జోగేశ్వరరావు, జ్యోతుల నెహ్రూ, ఎమ్మెల్సీ సోము వీర్రాజు, రాష్ట్ర స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ బూరుగుపల్లి శేషారావు, ఇతర అధికారులతో కలసి మంత్రి స మీక్షించారు. పుష్కరాల నిర్వహణలో పోలీసు, రెవెన్యూ, మున్సిపల్ దేవాదాయ, పర్యాటక, ఇరి గేషన్ విద్యుత్, ఆర్అండ్‌బీ, పంచాయతీరాజ్ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాల న్నారు. త్వరలోనే రాష్ట్రస్థాయి అధికారులు, హెచ్ వోడీలతో కలసి పూర్తిస్థాయి కార్యాచరణ ప్రణా ళిక సిద్ధం చేస్తామన్నారు. భక్తుల సౌకర్యార్థం ప్రత్యేక టెంపులు సర్క్యూట్లను అంటే నవజనా ర్ధన పారిజాతం ( వైష్ణవ) ఆలయాలు, ద్వాదశ జ్యోతిర్లింగ క్షేత్రాలను అనుసంధానం చేస్తూ ప ర్యాటక ప్యాకేజీలు రూపొందిస్తున్నట్టు చెప్పారు. పాపికొండల బోటు షికారును కూడా పుష్కరాల్లో భాగం చేయనున్నామని మంత్రి తెలిపారు.

స్పష్టమైన లక్ష్యాలతో బడ్జెట్... కలెక్టర్ కీర్తి చేకూరి మాట్లాడుతూ పుష్కరాల ఏర్పాట్లకు సంబంధించి స్పష్టమైన లక్ష్యాలతో బడ్జెట్‌కు అనుకూలంగా ఉండాలన్నారు. వాటి వివరాలు హెడ్ ఆఫ్ ది డిపార్ట్‌మెంట్‌కు పంపి కేటాయింపులు జరిగేలా సమన్వయంతో పనిచే యాలని సూచించారు. పుష్కరఘాట్ల వద్ద అండర్ గ్రౌండ్ కేబులు వర్కు ప్రతిపాదనలు సి ద్ధం చేయాలన్నారు. ఎమెల్సీ సోము వీర్రాజు మాట్లాడుతూ కేంద్రప్రభుత్వం నుంచి ఏఏ శాఖల ద్వారా నిధులు పొందే అవకాశం ఉందో గుర్తించి ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. రా జమండ్రి రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి మాట్లాడుతూ ఇంకా పుష్కరాలకు 15 నెలల సమయం మాత్రమే ఉందని, ఆలయాల అభివృద్ధి, రహదారి విస్తరణ, ఔటర్ రింగ్‌రోడ్డు పనులు వేగవంతం చేయాలన్నారు. అభివృద్ధి చేసే దేవాలయాలపై నివేదిక ఇవ్వాలన్నారు. అన పర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి మాట్లాడు తూ స్నాన ఘట్టాల సమీపంలో దాతల ఇచ్చిన స్థలాల్లోనూ ప్రదాన కార్యక్రమాల కోసం షెడ్ల ని ర్మాణం చేపట్టాలని సూచించారు. టెంపుల్ టూ రిజం, ఇరిగేషన్, రహదారుల అభివృద్ధి పనులు వెంటనే చేపట్టాలన్నారు. మండపేట ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు మాట్లాడుతూ తమ నియో జకవర్గంలో ఏడు గ్రామ పంచాయతీల పరిధిలో నుంచి గోదావరి నది ప్రవహిస్తుందని, అన్ని ఘాట్లకు సమాన ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. రా జానగరం ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ మా ట్లాడుతూ జాతీయ రహదారి మార్గాలకు అనుస ంధానంగా ఉన్న అంతర్గత రహదారులపై ప్రత్యేక దృష్టిపెట్టాలన్నారు. రాష్ట్ర స్కిల్ డెవ లప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ బూరుగుపల్లి శేషారావు మాట్లాడుతూ దీర్ఘకాలిక అవస రాలను దృష్టిలో పెట్టు కుని రహదారులు అభి వృద్ధి చేయాలన్నారు. జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ మాట్లాడుతూ దేవదాయ, ఇరిగేషన్, రహదారుల అభివృద్ధి కోసం ఉమ్మడి తూర్పు, పశ్చిమగోదావరి జిల్లాల అధికారులతో ప్రత్యేక సమీక్షా సమావేశం ఏ ర్పాటు చేయాల న్నారు. సమావేశంలో ఎస్పీ డి.నరసింహ కిశో ర్, మున్సిపల్ కమిషనర్ రాహుల్ మీనా, ఆర్డీ వోలు కె.భాస్కరరెడ్డి,రాణి సుస్మిత పాల్గొన్నారు.

టెంట్ సిటీల ఏర్పాటు.. పుష్కరాలకు కోట్లాది మంది భక్తులు వస్తారని అందుకనుగుణంగా కుంభ మేళా తరహాలో అత్యున్నత ప్రమాణా లతో టెంట్‌సిటీలు ఏర్పాటు చే యను న్నట్టు మంత్రి దుర్గేష్ చెప్పారు. హోంస్టే పాలసీ ప్రోత్సహించనున్నామని, ఉభయ గోదావరి జి ల్లాలోని మండువా లోగిళ్లకు ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వనున్నట్టు చెప్పారు. గోదావరి పరివాహక ప్రాంతాల్లో ఏఘాట్‌లో స్నానం చేసినా పుణ్య ఫలం సమానమనే విషయాన్ని ప్రజల్లోకి బాగా తీసుకెళ్లాలన్నారు. ప్రముఖ ప్రవచన కర్తలు గరికి పాటి నరసింహారావు, చాగంటి కోటేశ్వరరావు ద్వా రా విస్తృత ప్రచారం చేయనున్నట్టు తెలిపారు. కేంద్రప్రభుత్వ సాస్కి స్కీమ్ ద్వారా రూ.97 కోట్లతో చేపట్టిన అఖండ గోదావరి ప్రాజెక్టులను పుష్కరాల నా టికి పూర్తి చేస్తామన్నారు. పుష్కర ఘాట్ అభివృద్ధి, హేవలాక్ బ్రిడ్జి, బ్రిడ్జిలంక వాట ర్ స్పోర్ట్స్, కడియం ఎక్స్‌పీరియన్స్ సెంటర్, నిడ దవోలు కోట సత్తెమ్మ ఆలయాభివృద్ధి, శెట్టిపేట బోట్ షికారు పనులు వేగవంతం చేయాలని అ ధికారులను ఆదేశించారు. రోడ్ల కనెక్టివిటీ కోసం కేంద్ర ప్రభుత్వ సహకారంతో రూ.1000కోట్లతో ప్ర తిపాదనలు చేయనున్నట్టు చెప్పారు. శాంతి భద్ర తలు, పార్కింగ్ స్థలాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని జిల్లా ఎస్పీ డి.నరసింహ కిశోర్‌కు సూ చించారు.

# మీ భూమిపై ఎవ్వరి కన్ను పడకుండా నాదీ రక్షణ: సీఎం చంద్రబాబు

క్రైం కౌంటర్ న్యూస్,కర్నూలు, ఫిబ్రవరి 06: జీవితంలో ఎవరూ మీ భూమి మీద కన్ను వేయకుండా రక్షణ కల్పిస్తున్నట్లు ఏపీ ప్రజలకు సీఎం చంద్రబాబు నాయుడు తెలిపారు. క్యూ ఆర్ కోడ్ వల్ల సెల్ ఫోన్‌లో మీ భూమి మీకు కనిపిస్తుందని వివరించారు. తాను నాలుగో సారి ముఖ్యమంత్రిని అయ్యానని.. ఇప్పటి వరకు తన జీవితంలో ఇన్ని భూ సమస్యలు గతంలో ఎప్పుడూ చూడలేదని తెలిపారు. శుక్రవారం కర్నూలు జిల్లా ఎమ్మిగనూరు మండలం కలుగొట్ల గ్రామంలో 'మీ భూమి -- మీ హక్కు' కార్యక్రమానికి సీఎం ముఖ్య అతిథిగా హాజరయ్యారు. రాజ ముద్రతో రైతులకు పట్టాదారు పాస్ పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు మాట్లాడుతూ.. దేశానికి అన్నం పెట్టే రైతు కరోనా సమయంలో సైతం పని చేశారని గుర్తు చేశారు.ఏపీలో ప్రతి ఎకరాకు నీరు ఇవ్వాలన్నది తన సంకల్పమని స్పష్టం చేశారు. టెక్నాలజీకి అనుగుణంగా మార్చుకుంటూ వెళ్లాల్సి ఉందన్నారు. సూపర్ సిక్స్ పథకాలను సూపర్ హిట్ చేశామన్నారు చంద్రబాబు. రాజధాని అమరావతి నిర్మాణం, పోలవరం ప్రాజెక్ట్, పరిశ్రమలతో రాష్ట్రాభివృద్ధి పరుగులు పెడుతోందని పేర్కొన్నారు. ఓర్వకల్లును తాను అభివృద్ధి చేస్తే.. వాళ్లు సర్వనాశనం చేశారన్నారు. అయినా.. మీ వారసత్వ భూమిపై వైఎస్ జగన్ ఫొటో ఏమిటని రైతులను ఆయన సూటిగా ప్రశ్నించారు. అందుకే రాజముద్రతో కొత్త పుస్తకాలు ఇచ్చి.. మీకు మళ్లీ హక్కు కల్పించానని వివరించారు.

మీ జుట్టు జగన్ తన చేతుల్లో పెట్టుకుని పాలించాడని విమర్శించారు. పిల్లలు స్కూల్‌కి వెళ్లితే.. ఆయన ఫొటో చూడాలి.. పొలానికి వెళ్లితే ఆయన ఫొటో చూడాలనే విధంగా వైఎస్ జగన్ ఏర్పాటు చేశారన్నారు. ఈ దుర్మార్గుడి ఫొటో చూడాల్సిన పని ప్రజలకు ఏముందని ఆయన ప్రశ్నించారు. నూటికి 80 శాతం భూ సమస్యలు వస్తున్నాయని విమర్శించారు.

లక్ష ఎకరాల ప్రైవేట్ భూములను ప్రభుత్వ భూముల రికార్డుల్లో పెట్టారని మండిపడ్డారు. తాడేపల్లె సమీపంలో 10 ఎకరాల ప్రైవేట్ భూమిని హెలిప్యాడ్‌గా మార్చుకున్నారంటూ వైసీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్ ఆగడాలను ఈ సందర్భంగా ఎండగట్టారు. 70 ఏళ్ల రికార్డున్న ఆ భూమిని ప్రభుత్వ భూమిగా రికార్డులు మార్చారని తెలిపారు. రాజకీయ లబ్ధి, వ్యక్తిగత ప్రయోజనాల కోసం అక్రమాలు, దుర్మార్గాలు చేశారని వైసీపీ అగ్రనేతల ఆగడాలను సీఎం చంద్రబాబు బహిర్గతం చేశారు.

లంచాల వ్యవస్థకు స్వస్తి పలకాలి: సీఎం చంద్రబాబు

ప్రజల ఆస్తులకు భద్రత కల్పిస్తున్నామని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. ఎవరైనా మీ భూమిపై కన్నేస్తే జైలుకి వెళ్తారని స్పష్టం చేశారు. ఏ ఒక్క తప్పు ఉన్నా ఆ పట్టాదారు పుస్తకం చించేసి.. సరి చేసి ఇంకో పుస్తకం ఇస్తామని వివరించారు. లంచాల వ్యవస్థకు స్వస్తి చెప్పాలని ఉద్దేశ్యంతో ఈ విధానాన్ని తీసుకుని వచ్చామన్నారు. మీకు కాల్ చేసి.. వివరాలు తీసుకుని మార్పులు చేస్తున్నామని తెలిపారు. 91 వేల మంది రైతులకు పుస్తకాలు ఇస్తున్నామన్నారు. ఏపీని భూ వివాదాలు లేని రాష్ట్రంగా తీర్చిదిద్దుతానని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. అర సెంట్ స్థలం కోసం కుటుంబంలో తగాదాలు వస్తున్నాయని చెప్పారు. రాయలసీమ అంటే రాళ్ల సీమ కాదని.. రతనాల సీమ అని అందుకే అన్న ఎన్టీఆర్ ఈ ప్రాంతాన్ని సస్యశ్యామలం చేయాలని సంకల్పించారని వివరించారు. రాయలసీమకు నీరు ఇచ్చిన తర్వాతే.. చెన్నైకి ఎన్టీఆర్ నీరు అందించిన విషయాన్ని ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు గుర్తు చేశారు.

పోలవరానికి శనీశ్వరుడిలా అడ్డుతగిలారు: సీఎం చంద్రబాబు



హంద్రీనీవా, తెలుగు గంగా, గాలేరు- నగరి ప్రాజెక్టులు అన్న ఎన్టీఆర్ ఇచ్చారన్నారు. అనంతపురాన్ని ఉద్యానవనంగా మారుస్తున్నామని చెప్పారు. రాయలసీమలో ప్రస్తుతం అత్యధికంగా పంటలు పండించేలా నీరు ఇచ్చామన్నారు. భవిష్యత్‌లో సైతం కరెంట్ ఛార్జీలు పెంచమని హామీ ఇచ్చారు. తాను సీమ బిడ్డనేనని.. అన్న ఎన్టీఆర్ సైతం సీమ బిడ్డేనన్నారు. వైఎస్ జగన్ ఇప్పుడు వచ్చి రాయలసీమ అంటున్నారని పేర్కొన్నారు. రాయలసీమను అభివృద్ధి చేసింది తెలుగుదేశం పార్టీ అని గుర్తు చేశారు. పోలవరానికి శనీశ్వరుడిలా అడ్డు తగిలారంటూ జగన్‌పై నిప్పులు చెరిగారు సీఎం. గోదావరి పట్టిసీమ ద్వారా కృష్ణా డెల్టాకు ఇచ్చే 100 టీఎంసీల నీటిని రాయలసీమకు మళ్లించి కరవును తొలగించామన్నారు.

కరవు జిల్లాల్లో కియా కార్లు: సీఎం చంద్రబాబు

కరవు జిల్లాల్లో కియా కార్లు పరుగెత్తాయని సీఎం చంద్రబాబు తెలిపారు. అలా సీమను అభివృద్ధి చేస్తున్నామని వివరించారు. ప్రపంచానికి రాయలసీమ హార్టికల్చర్ అవుతుందని అభివర్ణించారు. కమీషన్లకు కక్కుర్తి పడి ఎన్‌జీటీ అనుమతి లేని ప్రాజెక్ట్ తెచ్చి.. తనపై బురద జల్లాలని చూశారంటూ వైసీపీ నేతలపై చంద్రబాబు ఆగ్రహం వ్యక్తం చేశారు. తుంగభద్ర(టీబీ) డ్యాం నీళ్లు కర్నూలు జిల్లా ప్రజలు ఎక్కువగా వినియోగించుకునేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఆర్డీఎస్ పూర్తి చేసి.. గుండ్రేవుల కోసం పక్క రాష్ట్రాలతో మాట్లాడి ఒప్పించి నిర్మిస్తామని విశ్వాసం వ్యక్తం చేశారు. వేదవతి ప్రాజెక్ట్ తానే ప్రారంభించి.. పూర్తి చేస్తానని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు.

వెంకటేశ్వర స్వామే కాపాడారు: సీఎం చంద్రబాబు

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో హైదరాబాద్ చుట్టూ తీవ్రవాదులు ఉండే సమయంలో.. ఆ నగరాన్ని తాను అభివృద్ధి చేశానని గుర్తు చేశారు. వారికి తాను అడ్డు తగులుతున్నానని తిరుపతిలో తనపై దాడికి దిగారని.. కానీ ఆ వెంకటేశ్వర స్వామి తనను కాపాడారన్నారు. బల ప్రదర్శన అనేది ఎన్నికల్లో చూపించుకోవాలని.. మిగతా సమయంలో ప్రజా సేవ చేయాలన్నారు. రాజకీయాల్లో ఇష్టానుసారంగా వ్యవహరిస్తే తాట తీస్తానని వైసీపీ నేతలను సీఎం చంద్రబాబు హెచ్చరించారు. 1995లో ఉమ్మడి ఏపీ సీఎంగా తాను ఉన్నానని.. కాబట్టే ఇప్పుడు హైదరాబాద్ ,సైబరాబాద్ నగరాలు ఉన్నాయని తెలిపారు. తాను చిత్రగుప్తుడిలా అన్ని రాసుకుంటూ ఉంటానని సీఎం చంద్రబాబు చెప్పారు.

# హైవేకు సౌర వెలుగులు

**రాత్రిపూట ప్రమాదాల నివారణకు ఎన్‌హెచ్‌ఏఐ చర్యలు**

**అనకాపల్లి నుంచి అన్నవరం వరకు పలు జంక్షన్లు, బ్లాక్‌స్పాట్ల వద్ద సోలార్ లైట్లు ఏర్పాటు**

**ఈ నెలాఖరులోగా పనులు పూర్తి**



క్రైం కౌంటర్ న్యూస్, నక్కపల్లి, ఫిబ్రవరి 6 జాతీయ రహదారిపై బ్లాక్ స్పాట్‌లుగా గుర్తించి ప్రదేశాల్లో రాత్రిపూట ప్రమాదాలను నివారించడానికి ఎన్‌హెచ్‌ఏఐ అధికారులు చర్యలు చేపట్టారు. అనకాపల్లి నుంచి కాకినాడ జిల్లా అన్నవరం వరకు వివిధ జంక్షన్‌లలో 150 సోలార్ లైట్లను ఏర్పాటు చేయనున్నారు.జాతీయ రహదారిపై అనకాపల్లి, పాయకరావుపేట వంటి పట్టణ ప్రాంతాలు, కశింకోట, తాళ్లపాలెం, ఎలమంచిలి వై జంక్షన్ల వద్ద మాత్రమే ఎల్‌ఈడీ లైట్లు వున్నాయి. ప్రధానంగా నక్కపల్లి వంటి మేజర్ పంచాయతీలో హైవేపై లైట్లు లేవు. దీంతో పలు జంక్షన్ల వద్ద రాత్రిపూట జాతీయ రహదారిని దాటే క్రమంలో పలువురు ప్రమాదాలకు గురై ప్రాణాలు కోల్పోతున్నారు. ఇంకా బ్లాక్ స్పాట్‌ల వద్ద కూడా వాహనదారులు ప్రమాదాల బారినపడుతున్నారు. అనకాపల్లి- రాజమహేంద్రవరం మధ్య నాలుగు లేన్ల రహదారిని ఆరు లేన్లకు విస్తరించకపోవడంతో రోడ్డు ప్రమాదాలు, మరణాలు ఏటేటా పెరిగిపోతున్నాయి. ఇది ఆందోళన కలిగించే అంశం కావడంతో ఎన్‌హెచ్‌ఏఐ అధికారులు ప్రమాదాలను నివారించి, రహదారి భద్రతను మెరుగుపరిచేందుకు దిద్దుబాటు చర్యలు చేపట్టారు. ఎక్కువ రద్దీ వుండే జంక్షన్లు, బ్లాక్ స్పాట్‌లలో సోలార్ లైట్లు ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. అనకాపల్లి నుంచి అన్నవరం వరకు వివిధ ప్రదేశాల్లో 150 సోలార్ లైట్లు ఏర్పాటు చేయనున్నారు. నక్కపల్లిలో ఆర్టీసీ కాంప్లెక్స్ నుంచి ఉపమాక హైవే జంక్షన్ల వరకు 16 సోలార్ లైట్లు ఏర్పాటు చేయనున్నారు. ఇంకా కాగిత, చినదొడ్డిగల్లు, వేంపాడు, ఉద్దండపురం, గొడిచెర్ల, ఒడ్డిమెట్ట జంక్షన్ల వద్ద కూడా వీటిని ఏర్పాటు చేస్తారు. వీటి కోసం ఆయా ప్రదేశాల్లో గోతుల తవ్వకం పనులను రెండు రోజుల క్రితం ప్రారంభించారు. ఈ నెలాఖరునాటికి సోలార్ లైట్ల ఏర్పాటు పూర్తవుతుందని సంబంధిత కాంట్రాక్టర్ ప్రతినిధులు చెబుతున్నారు.

# 'నీరు'పయోగం

క్రైం కౌంటర్ న్యూస్, అద్దంకి, ఫిబ్రవరి 6 శింగరకొండపాలెం ఎత్తిపోతల పథకం దశాబ్దకాలంగా నిరుపయోగంగా ఉంది. సుమారు నాలుగు దశాబ్దాల క్రితం ఈ పథకం ఏర్పాటుచేశారు. అద్దంకి మేజర్ కాలువ చివరి ఆయకట్టులో ఉన్న మండలంలోని శింగరకొండపాలెం, కలవకూరు, బొమ్మనంపాడు, గోపాలపురం, అద్దంకి, వేలమూరిపాడు, మణికేశ్వరం తదితర గ్రామాలలోని 3,229 ఎకరాల ఆయకట్టుకు స్థిరంగా నీరందించాలన్న లక్ష్యంతో ఈపథకాన్ని నిర్మించారు. పథక ప్రారంభంలో ఆయకట్టులోని మెట్ట పంటలకు సాగు నీరు పుష్కలంగా సరఫరా అయ్యింది. రెండు దశాబ్దాల కాలం నుంచి తరచూ మరమ్మతుల పాలవుతుంది. ఈక్రమంలో మూలకు చేరింది. గత తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో సుమారు రూ.70 లక్షలు వెచ్చించి కొత్త విద్యుత్ మోటార్‌లు, ట్రాన్స్‌ఫార్మర్‌లు ఏర్పాటుచేశారు.

తుదిదశకు వచ్చిన పథకాన్ని మూలకునెట్టిన వైసీపీ ప్రభుత్వం

ఎత్తిపోతల పథకం నుంచి అద్దంకి మేజర్ కాలువ వరకు నీటి పంపింగ్‌కు వేసిన పైప్‌లైన్‌ల లీకులతో ట్రయల్ రన్ సమయంలో స్వల్ప మరమ్మతులపాలైంది. ఈ క్రమంలో అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వంలో పథక మరమ్మతులకు కనీసం చిల్లిగవ్వ కూడా విడుదల చేయకపోవటంతో నిరుపయోగంగా మారింది. ప్రస్తుతం ప్రజాప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత సాగునీటి రంగానికి అధిక ప్రాధాన్యత ఇస్తుండటంతో ఎత్తిపోతల పథకానికి పూర్తిస్థాయిలో మరమ్మతులు చేపట్టి పూర్వవైభవం తీసుకువస్తారని రైతులు ఆశిస్తున్నారు.

భవనాసి రిజర్వాయర్ నిర్మాణంతో పథకానికి ముప్పు

విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ పలుసార్లు ఐడీసీ ఉన్నతాధికారులతో సమావేశం నిర్వహించి అంచనాలు తయారుచేయించారు. ప్రభుత్వం నుంచినిధుల విడుదల ఆలస్యం కావటంతో మరమ్మతులు చేపట్టలేదు. దీంతో ఎత్తిపోతల పథకం ప్రాంగణమంతా చిట్లడవిని తలపించేలా మారింది. భవనాసి చెరువును రిజర్వాయర్‌గా మారుస్తున్న నేపథ్యంలో శింగరకొండ ఎత్తిపోతల పథకం ముంపునకు గురయ్యే అవకాశం ఉంది. ఈ పథకాన్ని ఎత్తులో నిర్మించే విధంగా రూపకల్పన చేసి నిధులు మంజూరు చేయాలని రైతులు కోరుతున్నారు.

నీటి లభ్యత ఏడాది పొడవున ఉండే అవకాశం ఉండటంతోపాటు అద్దంకి మేజర్ కాలువ ఇటీవల వరకు అద్దంకి పట్టణంలో ఆక్రమణలతో నీటి పారుదలకు కూడా అవకాశం లేకుండా పోయింది. అద్దంకి మేజర్ కాలువను మినీ బైప్ష?సగా మార్చే క్రమంలో ఇప్పటికే ఆక్రమణలు తొలగింపు జరగటంతో దిగువ ఆయకట్టుకు నీటి ప్రవాహానికి అడ్డంకులు తొలగిపోయాయి. మరమ్మతులకు నిధులు మంజూరై పనులు పూర్తయితే ఆయకట్టులో ఏడాది పొడవునా మెట్ట పంటల సాగుకు అవకాశం ఏర్పడుతుందని రైతులు అభిప్రాయపడుతున్నారు.



# సినిమా




## ‘ది రాజా సాబ్’ ఓటిటి రివ్యూ.

రెబల్ స్టార్ ప్రభాస్ నటించిన హార్రర్ కామెడీ ఎంటర్టైనర్ రాజా సాబ్ ఓటిటిలోకి ఎంట్రీ ఇచ్చింది. థియేటర్లలో విడుదలైన మొదటి రోజే డివైడ్ టాక్ తెచ్చుకున్న ఈ సినిమా.. కేవలం ప్రభాస్ అనే బ్రాండ్ ఇమేజ్, ఆయన స్టార్‌డమ్‌తో బాక్సాఫీస్ వద్ద 200 కోట్ల రూపాయల మార్క్ దాటేసింది. కథలో విషయం ఉందా లేదా అనే విషయం పక్కన పెడితే.. ప్రభాస్ స్క్రీన్ ప్రెజెన్స్ వల్లే ఆ మాత్రం వసూళ్లు వచ్చాయని అందరికీ తెలుసు. అయితే థియేట్రికల్ రన్ ముగిసిన తర్వాత.. ఇప్పుడు స్మాల్ స్క్రీన్ మీద సినిమా రిలీజ్ అవ్వడంతో అందరి దృష్టి దీనిపై పడింది. ముఖ్యంగా థియేటర్ రిలీజ్ సమయంలో వచ్చిన విపరీతమైన ట్రోలింగ్‌ను దృష్టిలో పెట్టుకుని, ఓటిటి వెర్షన్‌లో మేకర్స్ ఏమైనా మార్పులు చేశారా.? లేక అక్కడ జరిగిన డ్యామేజ్ ఇక్కడ కూడా కంటిన్యూ అవుతుందా.? అనే ఆసక్తి అందరిలోనూ ఉంది. సినిమా థియేటర్లలో ఉన్నప్పుడు సోషల్ మీడియాలో జరిగిన రచ్చ అంతా ఇంతా కాదు.

సినిమాలోని చాలా సన్నివేశాల్లో.. ముఖ్యంగా లాంగ్ షాట్స్ అండ్ ఫైట్ సీక్వెన్స్‌లలో ప్రభాస్ కాకుండా ఆయన బాడీ డబుల్ స్పష్టంగా కనిపిస్తున్నారంటూ నెటిజన్లు ఫోటోలు, వీడియోలతో సహా ట్రోల్ చేశారు. ఒక పక్క స్టార్ హీరో సినిమా అయ్యుండి.. ఇలాంటి ఔట్ పుట్ ఇవ్వడంపై విమర్శలు వెల్లువెత్తాయి. దర్శకుడు మారుతి టేకింగ్ బాగున్నప్పటికీ, విజువల్ క్వాలిటీ విషయంలో.. హీరోని చూపించే విషయంలో శ్రద్ధ తీసుకోలేదనేది అభిమానుల ప్రధాన ఆరోపణ. ఈ నెగిటివ్ టాక్ వల్లే సినిమా అనుకున్న రేంజ్‌లో బ్లాక్ బస్టర్ కాలేకపోయిందనే వాదన కూడా ఉంది. అందుకే ఇప్పుడు ఓటిటి రిలీజ్‌లో ఆ తప్పులను సరిదిద్దేందుకు చిత్ర యూనిట్ ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నట్లు స్పష్టంగా కనిపిస్తోంది. సాధారణంగా థియేటర్లో రిలీజైన సినిమానే యథాతథంగా ఓటిటిలో వదులుతారు. కానీ రాజా సాబ్ విషయంలో డిజిటల్ స్ట్రీమింగ్ సంస్థ, నిర్మాతలు ఒక అడుగు ముందుకేసి డ్యామేజ్ కంట్రోల్ చర్యలు చేపట్టారు.

ఓటిటి వెర్షన్ కోసం ప్రత్యేకంగా కలర్ గ్రేడింగ్‌లో మార్పులు చేశారు. థియేటర్లో డల్లుగా అనిపించిన కొన్ని ఫ్రేమ్స్‌ని బ్రైట్‌గా మార్చడం, వీఎఫ్ఎక్స్ లోపాలను సరిదిద్దడం అర్థమైపోతుంది. అంతేకాకుండా థియేటర్లో ఎడిటింగ్‌లో లేపేసిన కొన్ని కొత్త సన్నివేశాలను డిజిటల్ వెర్షన్‌లో యాడ్ చేయడం విశేషం. ఈ కొత్త సీన్స్ కథనానికి మరింత బలాన్ని చేకూర్చడమే కాకుండా, సినిమా ఫ్లోని కాస్త పేసీగా మార్చాయి. ట్రోలింగ్‌కు ఆస్కారం ఉన్న కొన్ని షాట్స్‌ను ట్రిమ్ చేయడం.. అలాగే కలర్ కరెక్షన్ ద్వారా కవర్ చేయడం వల్ల సినిమా క్వాలిటీ పెరిగింది. థియేటర్‌లో నెగిటివ్ రివ్యూలు చూసి సినిమాకు వెళ్లని వాళ్లు, ఇప్పుడు ఓటిటిలో చూసి ఆశ్చర్యపోతున్నారు. సినిమా మరీ అంత తీసిపారేసేలా లేదు కదా, బాగానే ఉంది అంటూ పాజిటివ్ కామెంట్స్ పెడుతున్నారు. ముఖ్యంగా ఫ్యామిలీ ఆడియన్స్ నుండి ఓటిటిలో మంచి స్పందన లభిస్తోంది. మారుతి మార్క్ కామెడీ, హార్రర్ ఎలిమెంట్స్ బాగానే అలరిస్తున్నాయి.






## ఈ నాలుగు సమస్యలను తరిమేసే తమలపాకులు.

ప్రజలు సాధారణంగా పాన్‌ను మౌత్ ఫ్రెషనర్‌గా పిలుస్తారు. కానీ ఆయుర్వేదం, సాంప్రదాయ వైద్యంలో ఇది ఆరోగ్యానికి ప్రయోజనకరంగా కూడా. తమలపాకులకు మతపరమైన, సాంస్కృతిక ప్రాముఖ్యత కూడా ఉంది. దీని చరిత్ర సుమారు ఐదు వేల సంవత్సరాల నాటిదని చెబుతారు. తమలపాకుల గురించి అనేక పురాతన, మత గ్రంథాలలో కూడా ప్రస్తావించారు. తమలపాకు అనే పదం సంస్కృత పదం పర్ణ నుండి ఉద్భవించింది. దీని అర్థం ఆకు. సాంస్కృతిక ప్రాముఖ్యతకు మించి, తమలపాకులను ఆరోగ్యానికి ప్రయోజనకరంగా కూడా భావిస్తారు.

తమలపాకులను వివిధ రకాలుగా తినవచ్చు. కొందరు ఖాళీ కడుపుతో వాటిని నమిలితే, మరికొందరు వాటితో టీ తయారు చేసుకుని తాగుతారు. తమలపాకులను అనేక సాంప్రదాయ, ఆధునిక వంటకాల్లో కూడా ఉపయోగిస్తారు. పాన్ తండాయ్ తయారు చేయడం కూడా చాలా సులభం. దీనికి తమలపాకులు, గుల్కంద్, పాలు, వెనిల్లా ఎసెన్స్, తండాయ్ పొడి అవసరం. ముందుగా తండాయ్ పొడిని నీటిలో నానబెట్టి, తమలపాకులను బాగా కడగాలి.ఇప్పుడు నానబెట్టిన తండాయి, తమలపాకులు, పాలు లేదా నీటిని మిక్సీలో వేసి బాగా కలపండి. మిశ్రమం మెత్తగా అయిన తర్వాత తండాయి సిద్ధంగా ఉంటుంది. దానిని ఒక గ్లాసులో పోసి ఐస్ క్యూబ్స్ తో చల్లగా సర్వ్ చేయండి. తమలపాకుల్లో ఉండే యాంటీమైక్రోబయల్ లక్షణాలు నోటిలోని హానికరమైన బ్యాక్టీరియాతో పోరాడటానికి సహాయపడతాయి. భోజనం తర్వాత తమలపాకులను నమలడం వల్ల జీర్ణక్రియ మెరుగుపడుతుందని, నోటి దుర్వాసన తగ్గుతుందని నిపుణులు చెబుతున్నారు.తమలపాకులు బరువును నిర్వహించడానికి, మలబద్ధకం నుండి ఉపశమనం పొందడానికి, నొప్పిని తగ్గించడానికి కూడా సహాయపడతాయని నమ్ముతారు. అయితే, ఈ సమాచారం సాధారణమైనది. ఏవైనా ఆరోగ్య సమస్యల కోసం వాటిని క్రమం తప్పకుండా తీసుకునే ముందు వైద్యుడిని లేదా నిపుణుడిని సంప్రదించడం ముఖ్యం.



## నాలుగే నాలుగు ఆకులు చాలు.

మన నిత్య జీవితంలో చిన్నపాటి మార్పులు చేసుకోవడం వల్ల కొన్నిసార్లు అనూహ్యమైన ఆరోగ్య ప్రయోజనాలను పొందవచ్చు. అలాంటి ఒక అద్భుతమైన మార్గం ఉదయాన్నే కొన్ని కరివేపాకుల్ని తినడం.. అవును.. కరివేపాకు ఆకులను ఉదయాన్నే తింటే ఎన్నో ప్రయోజనాలను పొందవచ్చు.. మన వంట ఇంట్లో నిత్యం ఉండే కరివేపాకులు కేవలం కూరలకు రుచి, సువాసనను మాత్రమే కాదు, సంపూర్ణ ఆరోగ్యానికి ఎన్నో లాభాలను అందిస్తాయి. చాలామంది కూరల్లో కరివేపాకుల్ని పక్కన పెట్టేస్తుంటారు.. కానీ వాటి ప్రయోజనాలు తెలిస్తే ఎవరూ వాటిని వదులుకోరు. ఇవి మన చర్మం, జుట్టు ఆరోగ్యంతో పాటు మొత్తం శారీరక వ్యవస్థకు రక్షణ కల్పిస్తాయి. అందుకే వంటల్లో వాడటంతో పాటు, ఉదయాన్నే ఖాళీ పొట్టతో కొన్ని కరివేపాకుల్ని తినడం అత్యంత మేలు చేస్తుంది. మొదట్లో కాస్త చేదుగా అనిపించినా, క్రమంగా అలవాటు పడిపోతారు.

కరివేపాకుల్లో ఎన్నో పోషకాలు..

కరివేపాకుల్లో విటమిన్ సి, ఫాస్ఫరస్, ఐరన్, కాల్షియం, నికోటినిక్ యాసిడ్ వంటి ముఖ్యమైన పోషకాలు సమృద్ధిగా ఉంటాయి. ఈ పోషకాలు శరీరానికి అనేక విధాలుగా సహాయపడతాయని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు.

జుట్టు ఆరోగ్యానికి మంచిది: జుట్టు రాలే సమస్యతో బాధపడేవారు ఉదయం నిద్ర లేవగానే ముందుగా ఒక గ్లాసు మంచినీరు తాగాలి. కొన్ని నిమిషాల తర్వాత నాలుగైదు కరివేపాకుల్ని నోట్లో వేసుకొని బాగా నమిలేయాలి. ఆ తర్వాత అరగంట పాటు ఏమీ తినకుండా ఉండాలి. ఈ విధానం జుట్టు రాలడాన్ని తగ్గించి, దాని ఎదుగుదలకు తోడ్పడుతుంది. కూరల్లో కరివేపాకుల్ని ఎక్కువగా వాడటం కూడా జుట్టు రాలే సమస్యను తగ్గించడంలో సహాయపడుతుంది.

జీర్ణక్రియ మెరుగుదలకు మంచిది: కరివేపాకుల్ని తినడం వల్ల పొట్టలో జీర్ణక్రియ మెరుగుపడుతుంది. ఖాళీ పొట్టతో వీటిని నమలడం వల్ల జీర్ణ వ్యవస్థలోని ఎంజైమ్‌లు క్రమబద్ధీకరించబడతాయి. ఇది మూత్రనాళం చక్కగా పనిచేసేలా చేసి, మలబద్ధకం వంటి సమస్యల నుండి ఉపశమనం కలిగిస్తుంది. కొందరికి ఉదయం లేవగానే బద్ధకంగా, వికారంగా అనిపిస్తుంది. ఈ సమస్య కరివేపాకులతో తీరిపోతుంది. జీర్ణక్రియ వ్యవస్థ సక్రమంగా పనిచేయడం వల్ల వికారం, వాంతులు అయ్యే పరిస్థితి నుండి బయటపడవచ్చు.

బరువు తగ్గడంలో -- కొలెస్ట్రాల్ నియంత్రణలో సహాపడుతుంది: బరువు తగ్గాలని కోరుకునేవారు కరివేపాకుల్ని తమ ఆహారంలో భాగంగా చేసుకోవాలి. ఇవి శరీరంలో పేరుకుపోయిన చెడు వ్యర్థాలను బయటకు పంపడంలో సహాయపడతాయి. ముఖ్యంగా, చెడు కొలెస్ట్రాల్‌ను తగ్గించి, కొలెస్ట్రాల్ స్థాయిలను సమతుల్యంగా ఉంచడంలో కరివేపాకులు ప్రభావవంతంగా పనిచేస్తాయి. ఇది గుండె ఆరోగ్యానికి కూడా మేలు చేస్తుంది.

కంటి చూపు మెరుగుదలకు మంచిది: కరివేపాకులకు కంటి చూపుతో ప్రత్యక్ష సంబంధం ఉంది. ఆరోగ్య ప్రయోజనాలను పొందవచ్చు.

## పాకిస్థాన్‌కు ఫస్ట్ మ్యాచ్‌తోనే ఫుల్ టెన్షన్..

భారత్, శ్రీలంక వేదికగా టీ20 వరల్డ్ కప్ 2026 ప్రారంభం కానుంది. అయితే భారత్‌లో మా ఆటగాళ్లకు భద్రత లేదంటూ.. బంగ్లాదేశ్ జట్టు ఇప్పటికే ఈ టోర్నీ నుంచి వైదొలిగిన సంగతి తెలిసిందే. దీంతో బంగ్లాదేశ్ స్థానంలో స్కాట్లాండ్‌కు ఆడే అవకాశం లభించింది. మరోవైపు బంగ్లాకు మద్దతు పాకిస్థాన్ సైతం కీలక నిర్ణయం తీసుకుంది. తొలుత ఏకంగా టీ20 వరల్డ్ కప్‌నే బాయ్‌కాట్ చేయాలని పాక్ భావించింది. కానీ ఐసీసీ కన్నెర్ర జేస్తుందనే భయంతో చివరికి వెనక్కి తగ్గింది. టీ20 వరల్డ్ కప్‌లో ఆడతాం కానీ.. ఫిబ్రవరి 15న భారత్‌తో మ్యాచ్ ఆడబోం అని పాకిస్థాన్ ప్రకటించింది. భారత్‌తో మ్యాచ్‌లో పాకిస్థాన్ ఆడకపోతే.. ఆ జట్టు కీలకమైన రెండు పాయింట్లు కోల్పోవాల్సి వస్తుంది. ఈ పాయింట్లు టీమిండియా ఖాతాలో పడతాయి. ఇది పాకిస్థాన్ తదుపరి దశకు చేరుకునే అవకాశాలను ప్రభావితం చేస్తుంది. ఈ టెన్షన్లో పాకిస్థాన్ ఆటగాళ్లు ఉండగానే.. ఆ జట్టుకు మరో షాక్ తగలబోయే సూచనలు కనిపిస్తున్నాయి.

షెడ్యూల్ ప్రకారం.. ఫిబ్రవరి 7న పాకిస్థాన్, నెదర్లాండ్స్ మధ్య జరిగే మ్యాచ్‌తో ఐసీసీ టీ20 వరల్డ్ కప్ 2026 ప్రారంభం అవుతుంది. అయితే కొలంబోలోని సింహాళీస్ స్పోర్ట్స్ క్లబ్ గ్రౌండ్ వేదికగా జరిగే ఈ మ్యాచ్‌కు వాతావరణం అనుకూలించకపోయే అవకాశం ఉంది. ఈ వేదిక మీదే.. పాకిస్థాన్, ఐర్లాండ్ మధ్య వార్మప్ మ్యాచ్ జరగాల్సి ఉండగా.. ఎడతెగని వర్షం కారణంగా ఒక్క బంతి కూడా పడకుండా ఈ మ్యాచ్ రద్దయ్యింది.

పాకిస్థాన్ తొలి మ్యాచ్ ఆడబోయే శనివారం నాడు కూడా కొలంబోలో వర్షం కురిసే అవకాశం ఉంది. వాతావరణ శాఖ అంచనాల ప్రకారం.. ఆ రోజు వర్షం కురిసే అవకాశం 60-70 శాతంగా ఉంది. మ్యాచ్ జరిగే టైంలోనే వర్షం కురిసే ఛాన్స్ ఉండటంతో ఆటకు అంతరాయం కలగొచ్చు. ఒకవేళ వర్షం ప్రభావం ఎక్కువగా ఉంటే ఓవర్లను కుదించాల్సి వస్తుంది. కొలంబోలో వాతావరణం వేగంగా మారుతుంది. ఒకవేళ వర్షం గనుక భారీగా పడి మ్యాచ్ రద్దయితే.. పాకిస్థాన్, నెదర్లాండ్స్‌కు చెరో పాయింట్ కేటాయిస్తారు. భారత్‌తో మ్యాచ్‌ను కూడా బాయ్‌కాట్ చేస్తే.. రెండు మ్యాచ్‌లకుగానూ పాక్ ఖాతాలో ఒక్క పాయింటే చేరుతుంది.

దీని వల్ల పాకిస్థాన్ సూపర్ 8 చేరాలంటే.. గ్రూప్-ఏలో అమెరికా, నమీబియా జట్లతో మ్యాచ్‌లు చావో రేవో అన్నట్టుగా మారతాయి. ఇక్కడ మరో ముఖ్యమైన విషయం ఏంటంటే.. 2024 టీ20 వరల్డ్ కప్‌లో పాకిస్థాన్‌ను అమెరికా జట్టు ఓడించింది. దీంతో పాక్ లీగ్ దశలోనే ఇంటి ముఖం పట్టింది.

ఒకవేళ పాకిస్థాన్ ఆడే తొలి మ్యాచ్ రద్దయ్యి.. భారత్‌తో మ్యాచ్‌ను బాయ్‌కాట్ చేస్తే.. పాక్ గ్రూప్-8 చేరే అవకాశాలను సూర్య సేన ప్రభావితం చేయగలదు. అమెరికా గత టోర్నీలో పాక్‌పై చేసిన మ్యాజిక్‌ను రిపీట్ చేసి.. టీమిండియా ఒక మ్యాచ్‌లో ఓడితే గనుక.. పాకిస్థాన్ సూపర్-8కు చేరడం కష్టం అవుతుంది.




## పెళ్లి రద్దు బాధ నుంచి బయటపడి, డబ్ల్యూపీఎల్ టైటిల్ విన్నర్‌గా

డబ్ల్యూపీఎల్ 2026 ఫైనల్లో ఆర్సీబీ అమ్మాయిలు అదరగొట్టారు. ఢిల్లీ క్యాపిటల్స్ నిర్దేశించిన 204 పరుగుల భారీ లక్ష్యాన్ని ఆర్సీబీ సునాయాసంగా ఛేధించింది. కెప్టెన్ స్మృతి మంధాన (41 బంతుల్లో 87), జార్జియా వోల్ (54 బంతుల్లో 79) దూకుడుగా ఆడటంతో 6 వికెట్ల తేడాతో విజయాన్ని అందుకుంది. ఈ గెలుపుతో ఆర్సీబీ వరుసగా రెండో ఏడాది డబ్ల్యూపీఎల్ టైటిల్‌ను తన ఖాతాలో వేసుకుంది. అయితే మరోవైపు ఢిల్లీ క్యాపిటల్స్ మాత్రం వరుసగా నాలుగోసారి డబ్ల్యూపీఎల్ ఫైనల్లో ఓటమిపాలైంది. బెంగళూరు విజయంలో కెప్టెన్ స్మృతి మంధాన కీలక పాత్ర పోషించారు. ఫైనల్లో భారీ లక్ష్య ఛేధనలో 41 బంతుల్లో 87 రన్స్ చేసిన స్మృతి ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్‌గా నిలిచారు. తీవ్ర ఒత్తిడి ఉండే ఫైనల్లో, అదీ ఛేజింగ్‌లో ఇంత దూకుడుగా బ్యాటింగ్ చేయడం సామాన్యమైన విషయం కాదు. అంతే కాదు ఈ డబ్ల్యూపీఎల్ సీజన్లో 377 పరుగులతో ఆరెంజ్ క్యాప్ హోల్డర్‌గానూ ఆమె నిలిచారు. దీన్ని బట్టి మంధాన ఎంతటి ఫామ్‌లో ఉందో అర్థం చేసుకోవచ్చు.

అయితే గత ఏడాది స్మృతి వ్యక్తిగత జీవితంలో తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొన్నారు. 2025 నవంబర్ 23న మహారాష్ట్రలోని సంగ్లీలో పలాష్ ముచ్చల్‌తో ఆమె వివాహం జరగాల్సి ఉంది. కానీ పెళ్లికి కొద్ది గంటల ముందు అనూహ్యంగా వివాహం నిలిచిపోయింది. అనంతరం పెళ్లిని రద్దు చేసుకుంటున్నట్లు ఆమె ప్రకటించారు. ముందుగా తండ్రి అనారోగ్యం కారణం అని చెప్పినప్పటికీ.. అంతకు మించి ఏదో జరిగిందనే అనుమానాలు వ్యక్తం అయ్యాయి.

ఇటీవల స్మృతి చిన్ననాటి స్నేహితుడు ఒకరు పలాష్ ముచ్చల్‌పై చీటింగ్ కేసు నమోదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పలాష్ పెళ్లికి ముందు మరో అమ్మాయితో బెడ్ మీద రెడ్ హ్యాండెడ్‌గా దొరికిపోయాడంటూ సంచలన ఆరోపణలు చేశారు. అయితే పలాష్ ఈ ఆరోపణలను ఖండించారు. కారణం ఏదైనప్పటికీ.. స్మృతి పెళ్లి మాత్రం ఆగిపోయింది. ఇలాంటి పరిస్థితుల్లో మరొకరైతే డిప్రెషన్లోకి వెళ్లిపోతారు. ఇంటి నుంచి బయటకు అడుగుపెట్టడానికే భయపడతారు. కానీ స్మృతి మాత్రం ఈ పరిస్థితులను ధైర్యంగా ఎదుర్కొన్నారు. అంతే కాదు ఎంతో వేగంగా ఈ బాధ నుంచి బయట పడ్డారు. వ్యక్తిగత జీవితంలోని పరిణామాలు ప్రొఫెషనల్ గేమ్‌పై ఏమాత్రం ప్రభావం చూపకుండా తను జాగ్రత్తపడ్డారు. బ్యాట్‌తో అద్భుతంగా రాణించడమే కాకుండా.. కెప్టెన్‌గానూ సత్తా చాటి వరుసగా రెండోసారి డబ్ల్యూపీఎల్ టైటిల్‌ను ఆర్సీబీకి అందించారు. అందుకే విరాట్ కోహ్లి ఆమెను ప్రశంసలతో ముంచెత్తారు. గత రెండు నెలల్లో స్మృతి ఎంతగా ఇబ్బంది పడిందో ఆమె సహచర మహిళా క్రికెటర్లకు తెలుసు. అందుకే శ్రేయాంక పాటిల్ ఆర్సీబీ టైటిల్ విజయాన్ని తమ కెప్టెన్ స్మృతి మంధానకు అంకితం చేస్తున్నట్లు ప్రకటించారు.



Printed at Sunday printing press 3_4297 Saraswati complex SVN colony. guntur.ap 522006. Published by Katikala Vara Prasad. at H No: 21-119, West Ibrahimpatnam, Krishna, Andhra Pradesh - 521456. . Editor. Katikala Vara Prasad. RNI- 2015/62250, Reg No: APTEL/25/A2844. Ph:9849707349 email:kvp6858@gmail.com